## సమస్యలపై షబ్బీర్ అలీ ఆరా

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని జీఆర్, హౌజింగ్ బోర్డు కాలనీల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం సాయంత్రం పర్యటించారు. వరదలు ముంచెత్తడంతో కాలనీవాసుల ఇబ్బందులు, సమస్యలపై ఆరా తీశారు. సీఎం రేవంత్ రెడ్డి జీఆర్ కాలనీకి గురువారం వస్తున్నారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని భరోసా ఇచ్చారు. అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించి బాధితులతో మాట్లాడతారన్నారు. అనంతరం కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించి జిల్లాలో జరిగిన నష్టాన్ని అధికారుల ద్వారా తెలుసుకుంటారని పేర్కొన్నారు. వర్షానికి కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణానికి కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించనున్నట్లు తెలిపారు.



## ఆర్మూర్ నుంచి శంషాబాద్‌కు ఏసీ బస్సులు ప్రారంభం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ డిపో నుంచి శంషాబాద్‌కు ఏసీ బస్సులను బుధవారం ప్రారంభించారు. డిపో మేనేజర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఏసీ బస్సులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో మెకానికల్ ఫోర్‌మెన్ గంగాకిషన్, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి సావిత్రి విజేందేర్, కంట్రోలర్ సూదన్, డీవీఎస్ చక్రవర్తి, యూత్ అశోక్, వేల్పూర్ గంగాధర్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో నాన్ మైనార్టీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాయి చైతన్య తెలిపారు. 5 నుంచి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్ తో పాటు రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు.

## హెల్మెట్లు పంపిణీ చేసిన అద్విక ఫ్యామిలీని అభినందించిన సీపీ



అభినందిస్తున్న సీపీ సాయి చైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గూపన్ పల్లికి చెందిన బెన్నీ తన కూతురు అద్విక పుట్టినరోజు సందర్భంగా గ్రామస్థులకు 60 హెల్మెట్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సీపీ సాయి చైతన్య వారిని అభినందించారు. బుధవారం వారిని తన కార్యాలయానికి పిలిపించి, శాలువాతో సన్మానించారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా హెల్మెట్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బెన్నీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై సంతోష్ రెడ్డి, అద్విక కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించేనా..!

- కుండపోత వర్షా లతో తీవ్రంగా నష్టపోయిన రైతులు, ప్రజలు
- ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూపు
- కామారెడ్డిలో పర్యటించనున్న సీఎం రేవంత్

**ఇటీవల కురిసిన కుండపోత వర్షా లకు కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. గతంలో ఎన్నడూ ఎరగని రీతిలో అతిభారీ వర్షా లు కురవడంతో నదులు, వాగులకు వరద పోటెత్తింది. చెరువులు, కుంటలకు భారీగా వరదలు రావడంతో తీవ్ర పంట నష్టం జరిగింది. అంతేకాకుండా రోడ్లు ధ్వంసమయ్యాయి. కామారెడ్డి పట్టణంతో పాటు పలు గ్రామాలు నీటమునిగాయి. దీంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. దీంతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తారా అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.**

*- అక్షరటుడే, కామారెడ్డి*


భారీ వర్షాలతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండిపోయి ఆ నీరంతా వ్యవసాయ పొలాల్లోకి చేరింది. దీంతో పంట పొలాలన్నీ చెరువులను తలపించాయి. జిల్లాలో ఇప్పటికే సుమారు 50 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా తెలుస్తోంది. ఇంకా పూర్తిస్థాయిలో అధికారులు పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో దాదాపు వెయ్యి ఇళ్ల వరకు పాక్షికంగా, 242 పాఠశాలలు దెబ్బతిన్నట్లుగా అధికారులు అంచనా వేశారు. వీటన్నింటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

### తెగిపోయిన రోడ్లు, కొట్టుకుపోయిన చెరువులు

జిల్లాలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు పలుచోట్ల ధ్వంసమయ్యాయి. 44వ జాతీయ రహదారి సైతం దెబ్బతిన్నది. విద్యుత్ లైన్లు ధ్వంసమయ్యాయి. ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ పలు తండాలు అంధకారంలో ఉన్నాయి. ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నా.. మళ్లీ వర్షాలు పడితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. దీంతో శాశ్వతంగా పనులు చేపట్టేందుకు నిధుల విడుదలకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తాత్కాలిక, శాశ్వత పనులకు దాదాపు రూ. 200 కోట్లకు పైగా అవసరం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

### సహాయం కోసం ఎదురుచూపు

జిల్లాలో భారీ వర్షాలతో నష్టపోయిన రైతులు, ప్రజలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేయగా తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో పంట చేతికి వస్తుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నారు. కాగా.. పంట నష్టంపై ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో జరిగిన నష్ట వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపే పనిలో పడ్డారు. వరద బాధితులకు నష్ట పరిహారంతో పాటు జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, ఇతర పనులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ సీఎం దృష్టికి తీసుకువెళ్లి స్పెషల్ నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలని ఆశిస్తున్నారు.









## తెయూలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి 11న ఇంటర్వ్యూలు

**అక్షరటుడే, డిచ్ పల్లి:** తెలంగాణ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం చేపట్టనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న ఉదయం 11 గంటలకు పరిపాలనా భవనంలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత, రెండేళ్ల బోధన అనుభవం ఉన్నవారు అర్హులని, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్ ను సందర్శించాలని పేర్కొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో వీఎల్‌టీ ఫైల్ ప్రాసెస్ చేయడం కోసం లంచం తీసుకుంటూ.. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు. మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్, ఇన్‌ఛార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కర్ణ శ్రీనివాస్‌రావు వీఎల్‌టీ ఫైల్‌ను ప్రాసెస్ చేసేందుకు ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దరఖాస్తుదారుడి నుంచి రూ.10వేలు డిమాండ్ చేసిన కర్ణ శ్రీనివాస్‌రావు చివరకు రూ.7వేలకు బేరం కుదుర్చుకున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. ఈ క్రమంలో బుధవారం ఆర్ఐ లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

### అవినీతి కేంద్రాలుగా..

రాష్ట్రంలోని పలు మున్సిపల్ ఆఫీస్‌లు అవినీతి కేంద్రాలుగా మారాయి. పనుల కోసం వచ్చే ప్రజలను లంచాల కోసం అధికారులు వేధిస్తున్నారు. పైసలు ఇస్తేనే పనులు చేస్తున్నారు. లేదంటే కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. నిత్యం ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా.. లంచాలకు మరిగిన అధికారులు మారడం లేదు. కొందరు అధికారులు అయితే ఏకంగా ఏజెంట్లను పెట్టుకొని డబ్బులు వసూలు చేస్తున్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన రూరల్ ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఇందల్వాయి:** రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఇందల్వాయి బస్టాండ్ ఆవరణలో ఖాళీ స్థలాన్ని పరిశీలించి కూరగాయల మార్కెట్ కు కేటాయించాలని సూచించారు. అనంతరం లింగాపూర్ వంతెనను పరిశీలించారు. వెంగల్ పాడ్ లో వరద వరద బాధితులను పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు, దుస్తులు అందించాలని తహశీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, చింతల కిషన్, తహశీల్దార్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.






## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**అక్షరటుడే, కామారెడ్డి:** హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ బుధవారం తీర్పునిచ్చారు. డోంగ్లికి చెందిన బరిగే లక్ష్మణ్(60) జులై 27న మేనూరు బ్యాంకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. సలబత్ పూర్ శివారులో ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన, హైవే సర్వీస్ రోడ్డుకు సమీపంలో ఒక వ్యక్తి మృతదేహం లభించడంతో లక్ష్మణ్ గా గుర్తించారు. సలబత్‌పూర్ గ్రామానికి చెందిన రపన్వాడ సాయిలు అలియాస్ ర్యాపన్వార్ సాయిలును నిందితుడిగా గుర్తించారు. సలబత్ పూర్ శివారులోని ఫ్లైఓవర్ వద్ద బస్సు కోసం వేచి చూస్తున్న లక్ష్మణ్ ను గమనించి అతని వద్ద డబ్బు దోచుకోవాలని సాయిలు భావించాడు. డబ్బు తీసుకునే క్రమంలో లక్ష్మణ్‌పై దాడి చేసి సాయిలు హత్య చేశాడు. కోర్టులో సాక్షాధారాలను పోలీసులు దాఖలు చేయగా పరిశీలించిన న్యాయమూర్తి నిందితునికి జీవిత ఖైదుతో పాటు 2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.





